దేశానికి అన్నపూర్ణ తెలంగాణ

60 ఏండ్ల విధ్వంసం పదేండ్లలో పండుగైంది • ఎడారి తెలంగాణ పసిడి పంటలమయం • దేహీ అన్న రైతన్న.. దేశానికి పెట్టే స్థాయికి

- చేయిపట్టి నడిపించిన కేసీఆర్
- రైతు ఎజెండాగా సంక్షేమ పథకాలు
- పెరిగిన పంటల సాగు, ఉత్పత్తి
- 2.40 కోట్ల ఎకరాలకు పెరిగిన సాగు విస్తీర్ణం
- రైతుల బతుకు మార్చిన రైతుబంధు
- ఆరేండ్లలో రూ. 73 వేల కోట్లు అన్నదాతల బ్యాంకు ఖాతాల్లో జమ

పదేండ్ల కిందట.. తెలంగాణ ప్రాంతం ఎడారిని తలపించేది. సాగు నీళ్లు లేక, కరెంట్ లేక భూములన్నీ బీడుబారేవి. రైతులు, ప్రజలు బుక్కెడు బువ్వకు, గుక్కెడు నీళ్లకు ఏడ్చే దుర్భర పరిస్థితి. పైగా, తెలంగాణ వాళ్లకు ఎవుసం చేయరాదు, పంటలు పండించరాదు అన్న సమైక్యవాదుల కించపరిచే వ్యాఖ్యలు.

> సరిగ్గా పదేండ్ల తర్వాత.. ఏడారి తెలంగాణ పసిడి పంటలకు నెలవైంది. తెలంగాణ ఎవుసం.. వికసితమైంది. ఒకప్పుడు దేహీ అన్న తెలంగాణ రైతన్న ఇప్పుడు దేశానికే అన్నం పెట్టే స్థాయికి ఎదిగాడు.

హైదరాబాద్, మే 23 (నమస్తే తెలంగాణ): అరవై ఏండ్ల విధ్వంసాన్ని పదేండ్లలోనే రూపుమాపి, తెలంగాణ వ్యవసాయ రంగాన్ని దేశానికి రోల్‌మాడల్‌గా తీర్చిదిద్దింది కేసీఆర్ సర్కారు. స్వయంగా కేసీఆరే రైతు కావటంతో రైతుల సంక్షేమమే అజెండాగా అనేక సంక్షేమ పథకాలకు పురుడు పోశారు. రైతుబంధు, ఉచిత విద్యుత్తు, కాళేశ్వరం ప్రాజెక్టుతో దేశంలో తెలంగాణకు ప్రత్యేక స్థానాన్ని సంపాదించి పెట్టారు. ఒక్క వ్యవసాయమే కాదు.. దాని ఉప రంగాలను సైతం జోడెద్దుల్లా అభివృద్ధి వైపు పరుగులు పెట్టించారు. వ్యవసాయ సంక్షేమ పథకాలతో తెలంగాణలో పంటల సాగు భారీగా పెరిగింది. ఉచిత విద్యుత్తు, కాళేశ్వరంతో పాటు ఇతర పెండింగ్ సాగు నీటి ప్రాజెక్టులను పూర్తి చేయటం, రైతుబంధు వంటి పథకాలు వ్యవసాయానికి ఊపిరి పోశాయి. 2014-15లో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం 1.31 కోట్ల ఎకరాలు ఉండగా, ఇది 2022-23 నాటికి 2.38 కోట్లకు పెరిగింది. పదేండ్లలోనే కోటి ఎకరాల సాగు విస్తీర్ణం పెరగటం దేశ వ్యవసాయరంగ చరిత్రలో రికార్డు. పంట ఉత్పత్తి 1.50 కోట్ల టన్నుల నుంచి 3.62 కోట్లకు పెరిగింది.

రైతుబంధు

విడతల వారీగా రైతుబంధు పంపిణీ

నోట్: రైతుల సంఖ్య- లక్షల్లో, పంపిణీ మొత్తం- కోట్లలో, విస్తీర్ణం- లక్షల ఎకరాల్లో

సంవత్సరం	సీజన్	రైతుల సంఖ్య	పంపిణీ మొత్తం	విస్తీర్ణం
2018-19	వానకాలం	50.25	5236.29	130.91
	యాసంగి	49.13	5251.83	131.30
2019-20	వానకాలం	51.61	6125.54	122.51
	యాసంగి	42.42	4406.48	88.13
2020-21	వానకాలం	57.90	7279.02	145.58
	యాసంగి	59.32	7367.32	147.35
2021-22	వానకాలం	60.84	7360.41	147.21
	యాసంగి	63.00	7411.52	148.23
2022-23	వానకాలం	64.99	7433.13	148.66
	యాసంగి	65.00	7311.08	146.22
2023-24	వానకాలం	68.99	7624.74	152.49

పంపిణీ మొత్తం 72,817.04 కోట్లు

వరి సిరులు

2014-15లో 35 లక్షల ఎకరాల్లో మాత్రమే వరి సాగు కాగా, 2022-23లో ఇది ఏకంగా 121 లక్షల ఎకరాలకు పెరిగింది. అంటే తొమ్మిదేండ్లలో 86 లక్షల ఎకరాల్లో వరి సాగు పెరగటం గమనార్హం. వరి సాగు పెరగడంతో ధాన్యం ఉత్పత్తి కూడా భారీగా పెరిగింది. 2014-15లో 68 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా 2022-23 నాటికి ఇది 2.60 కోట్లకు చేరింది. ఆ పంటనూ ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేసింది. 2014-15లో కొనుగోలు చేసిన ధాన్యం 24.32 లక్షల టన్నులు మాత్రమే. 2021-22లో అది 120.60 లక్షలకు పెరిగింది. అంటే 187 శాతం పెరగటం గమనార్హం. గత ఏడాది వరకు మొత్తంగా రూ.1.33 లక్షల కోట్ల విలువైన 7.23 కోట్ల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది.

ఎరువులు, విత్తనాల గోస తీరింది

ఉమ్మడి రాష్ట్రంలో పంట సీజన్ ప్రారంభమవుతుందంటే చాలు రైతులు ఎవుసం పనులను వదిలేసి ఎరువులు, విత్తనాల కోసం పరిగెత్తే పరిస్థితి ఉండేది. పోలీస్‌స్టేషన్లలో పెట్టి మరీ ఎరువులు, విత్తనాలు అమ్మిన రోజులు రైతులకు ఇంకా గుర్తున్నాయి. ఎరువులు, విత్తనాల కోసం లాఠీ దెబ్బలు తిన్న పరిస్థితిని కూడా మర్చిపోలేదు. తెలంగాణ వచ్చాక ఈ పరిస్థితిని కేసీఆర్ పూర్తిగా మార్చేశారు. సీజన్‌కు ముందే ఎరువులు, విత్తనాలను తెప్పించి రైతులకు అందుబాటులో ఉంచారు. 2014లో ఎరువుల వినియోగం 27 లక్షల టన్నులు కాగా, 2022-23లో ఇది 40 లక్షలకు పెరిగింది. అయినా ఎక్కడా ఎరువుల కొరత రాలేదు.

పెట్టుబడి గోస తీర్చిన రైతు బంధు

ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు 'రైతు బంధు' పథకానికి కేసీఆర్ శ్రీకారం చుట్టారు. ప్రతి రైతుకు ఏటా ఎకరానికి రూ.10 వేల చొప్పున.. ప్రతి సీజన్‌లో సుమారు 65 లక్షల మందికి రూ.7,500 కోట్లు అందించారు. ఇప్పటి వరకు 11 విడతల్లో రూ. 72,815 కోట్లను బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు.

రైతు కుటుంబాలకు కొండంత అండగా

ఉమ్మడి పాలనలో రైతుల ఆత్మహత్యలతో మరణం మృదంగం మోగేది. ఈ పరిస్థితిని చూసిన కేసీఆర్.. రైతుబీమా పథకాన్ని అమలు చేశారు. ఏ కారణంతో అయినా సరే రైతు మరణిస్తే.. ఆ రైతు కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం అందించేలా చర్యలు తీసుకున్నారు. దానికి ప్రీమియాన్ని కూడా ప్రభుత్వమే చెల్లించింది. ఈ విధంగా వివిధ కారణాలతో మరణించిన సుమారు 1.15 లక్షల రైతు కుటుంబాలకు రూ.5,566 కోట్ల పరిహారాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం అందించింది.

రైతులకు రుణ విముక్తి

అప్పుల ఊబిలో కూరుకుపోతున్న రైతులకు రుణవిముక్తి చేయడమే లక్ష్యంగా కేసీఆర్ రుణమాఫీని ప్రకటించారు. తొలిసారి అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.లక్ష వరకు రుణమాఫీ చేశారు.. 2018లో మరోసారి అధికారంలోకి వచ్చాక రూ.లక్షమాఫీకి హామీ ఇచ్చింది. 2014లో తొలిసారి 35.31 లక్షల మంది రైతులకు రూ.16,144 కోట్ల రుణాలను మాఫీ చేసింది. రెండోసారి 23 లక్షల మందికి రూ.13 వేల కోట్లను మాఫీ చేయగా మరో రూ.6 వేల కోట్ల రుణాల మాఫీ పెండింగ్‌లో ఉన్నది. ఎన్నికల కోడ్‌తో అడ్డంకి ఏర్పడింది.

24 గంటల ఉచిత విద్యుత్తు

వ్యవసాయరంగాన్ని గాడిలో పెట్టేందుకు కేసీఆర్ ప్రభుత్వం చేసిన మరో కృషి 24 గంటల పాటు ఉచిత విద్యుత్తు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే కేసీఆర్ ఈ సమస్యను పరిష్కరించారు. ఉచిత విద్యుత్తు, పవర్ డిస్ట్రిబ్యూషన్ లైన్ల మరమ్మతుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఏకంగా రూ.75 వేల కోట్లు ఖర్చు చేసింది. తెలంగాణ ఏర్పాటు తర్వాత 9 లక్షల కొత్త వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు పెరిగాయి.

రైతు వేదికలు

రైతులను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు కేసీఆర్ ప్రభుత్వం ప్రతి 5 వేల ఎకరాలకు ఒక క్లస్టర్‌గా.. మొత్తం 2,601 రైతు వేదికలను నిర్మించింది. అందుకు రూ.572 కోట్లు ఖర్చు చేసింది. ప్రతి క్లస్టర్‌కు ఒక వ్యవసాయ విస్తరణ అధికారిని నియమించింది. ఈ వేదికల్లో రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగు, నూతన సాగు విధానాలపై అవగాహన కల్పించింది. 2014-15లో రాష్ట్రంలో గోదాముల సామర్థ్యం 39 లక్షల టన్నులు మాత్రమే ఉండగా 2023-24లో 74.04 లక్షల టన్నులకు పెరిగింది.

మత్స్యకారులకు వరంలా..

ఉమ్మడి రాష్ట్రంలో మత్స్యకారుల జీవితాలు ఛిన్నాభిన్నమయ్యాయి. అయితే రాష్ట్రం ఏర్పాటుకాగానే కుల వృత్తులకు పూర్వవైభవం తీసుకొచ్చి.. వాటిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న వారి బతుకుల్లో వెలుగులు నింపాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. 2015లో ఉచిత చేపపిల్లల పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టారు. ఏటా కనీసం రూ.వంద కోట్ల ఖర్చుతో పూర్తి ఉచితంగా చేపపిల్లల్ని పంపిణీ చేసింది. ఇప్పటి వరకు 414 కోట్ల చేపపిల్లల్ని పంపిణీ చేయగా వీటి ద్వారా 23 లక్షల టన్నుల చేపలు ఉత్పత్తి అయ్యాయి. వీటి విలువ రూ.32 వేల కోట్లని అధికారులు అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న చేపలను ఇక్కడి వ్యాపారులు ఢిల్లీ, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ, ఛత్తీస్‌గఢ్, అస్సాం వంటి రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు.

మిషన్ ఆయిల్‌పామ్

రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించేందుకు ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించింది. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించింది. రాష్ట్రం ఏర్పడినప్పుడు 27 వేల ఎకరాల్లోనే ఆయిల్‌పామ్ సాగవుతుండగా, ప్రస్తుతం 2 లక్షల ఎకరాలకు పెరిగింది. ఇందుకోసం ప్రభుత్వం ఏటా

గొర్రెల పంపిణీ

కుల వృత్తులను ప్రోత్సహించటంలో భాగంగా గొల్ల కురుమలకు కేసీఆర్ ప్రభుత్వం సబ్సిడీ గొర్రెల పంపణీని ప్రారంభించింది. ఈ పథకం కింద సుమారు రూ.6 వేల కోట్లు ఖర్చుచేసి 4.21 లక్షల గొర్రెల యూనిట్లను అందజేసింది (యూనిట్‌కు 21 గొర్రెలు). తద్వార రాష్ట్రంలో 1.5 కోట్ల గొర్రె పిల్లలు జన్మించాయి. ఈ పథకం వల్ల రాష్ట్రంలో గొర్రెల సంఖ్య 2 కోట్లకు చేరింది. దీంతో దేశంలోనే గొర్రెలు అత్యధికంగా కలిగిన రాష్ట్రాల్లో తెలంగాణ తొలి స్థానంలో నిలిచింది. పాడి రైతులను ప్రోత్సహించేందుకు లీటర్ పాలకు రూ.4 ప్రోత్సాహకాన్ని అందించింది. ఇందుకోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ఏటా రూ.100 కోట్లు ఖర్చుచేసింది. ఇక దేశంలోనే తొలిసారిగా సంచార పశు వైద్యశాలలను ఏర్పాటు చేసింది. తొలిదశలో 100 అంబులెన్స్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సంచార పశు వైద్యశాలల కోసం ఏటా రూ.30 కోట్ల చొప్పున సుమారు రూ.136 కోట్లు ఖర్చు చేసింది. తెలంగాణను ఆదర్శంగా తీసుకున్న కేంద్ర పశుసంవర్ధక శాఖ గతేడాది ఈ పథకాన్ని దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో అమలు చేసింది.

ఆర్నెల్లలోనే ఆగమాగం

కేసీఆర్ ప్రభుత్వం ఎంతో దీక్షతో, పట్టుదలతో, ముందుచూపుతో వ్యవహరించి 60 ఏండ్ల ఎవుసం గోసను తీర్చి గాడిలో పెడితే, కాంగ్రెస్ సర్కారు ఆర్నెల్లలోనే ఆగం చేస్తున్నది. రైతులకు మళ్లీ పదేండ్ల కిందటి గడ్డు పరిస్థితులు కండ్ల ముందు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ సర్కారు వచ్చిన రెండు నెలల్లోనే సాగునీటి కష్టాలు మొదలయ్యాయి. పంటలు ఎండిపోయాయి. కరెంట్ కోతలు ప్రారంభమయ్యాయి. మళ్లీ రాత్రిపూట కరెంట్ మొదలైంది. పండించిన పంటను కొనుగోలు చేసే దిక్కులేకుండా పోయింది. పెట్టుబడి సాయం అందటం లేదు. వడ్లకు బోనస్ ఇస్తామని, ఇప్పుడు సన్నవడ్లకే నంటూ మాట మార్చింది. ఒక్క మాటలో చెప్పాలంటే పదేండ్ల పాటు కష్టనష్టాలకు దూరంగా ఉన్న రైతులు మళ్లీ కష్టాల సుడిగుండంలో కూరుకుపోతున్నారు. సస్యశ్యామలంగా మారిన తెలంగాణ వ్యవసాయం.. మళ్లీ విధ్వంసం దిశగా అడుగులు వేస్తున్నది.

ధాన్యం కొనుగోళ్లలో సమస్యలు వాస్తవమే

- ఇబ్బందులు రాకుండా చర్యలు చేపడుతున్నాం
- తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్నీ తీసుకుంటాం
- మిల్లర్ల నుంచి డబ్బు తీసుకొన్నామన్నది అవాస్తవం
- పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్

హైదరాబాద్, మే 23 (నమస్తే తెలంగాణ): ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులున్నది వాస్తవమేనని పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ అన్నారు. వీలైనంత త్వరగా ఆ సమస్యలను పరిష్కరిస్తున్నట్టు చెప్పారు. ఈ మేరకు గురువారం సివిల్‌సప్లై భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పారదర్శకంగా జరుగుతున్నదని తెలిపారు. ఇప్పటి వరకు 39.51 లక్షల టన్నుల ధాన్యాన్ని కొన్నామని తెలిపారు. మొత్తం రూ.8,690 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేయగా, ఇప్పటికే రూ.7,208 కోట్లు రైతులకు చెల్లించామని వెల్లడించారు. పలు చోట్ల ధాన్యం నిబంధనలకు అనుగుణంగా లేకపోవటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. తాలు, తేమ, మట్టిపెళ్లలు లేకుండా ధాన్యం తీసుకురావాలని రైతులను కోరుతున్నామని అన్నారు.గతంతో పోల్చితే ధాన్యం కాంటాలో కోత భారీగా తగ్గిందని వివరించారు. డీఫాల్ట్ మిల్లర్ల నుంచి ఇప్పటికే రూ.660 కోట్లు రికవరీ చేశామని తెలిపారు. తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని, రైతులకు నష్టం రాకుండా చూస్తామని అన్నారు. టెండర్లలో విక్రయించిన ధాన్యం ఖాళీ చేయాల్సిన గడువు ముగిసిన నేపథ్యంలో ఏం చేస్తారనే ప్రశ్నకు త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. సన్న బియ్యం కొనుగోలులో అక్రమాలు జరిగాయంటూ వస్తున్న ఆరోపణలను ఆయన ఖండించారు. పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు ఆయనపై బీఆర్ఎస్, బీజేపీ నేతలు చేసిన ఆరోపణలపై స్పందిస్తూ.. సివిల్ సప్లై ఉద్యోగులకు మిల్లర్లు ఒక్క పైసా అయినా ఇచ్చారేమో చెప్పాలని, నిరాధార ఆరోపణలు చేస్తే చట్టపరంగా ముందుకెళ్తామని వెల్లడించారు. ఎన్నికల కోడ్ ఉండటంతో ఈ విషయంపై ఎక్కువగా మాట్లాడదల్చుకోలేదని, ఆ ఆరోపణల వెనుక ఏదో కుట్ర ఉన్నదని అనుమానం వ్యక్తం చేశారు. తామంతా నిజాయతీగా పని చేస్తున్నామని పేర్కొన్నారు.

క్వింటాలుపై రూ.216 U- ట్యాక్స్

మొదటిపేజీ తరువాయి...

ప్రకటన కూడా చేశారని పేర్కొన్నారు. ఒక్క రోజులోనే ఇవన్నీ ఎలా జరిగాయని ప్రశ్నించారు. టెండర్లలో తమవాళ్లు మాత్రమే పాల్గొనేలా 'జీఎస్టీ రిజిస్ట్రేషన్ హైదరాబాద్'లో ఉండాలంటూ నిబంధన పెట్టారని ఆరోపించారు. గ్లోబల్ టెండర్లలో పాల్గొనేందుకు హర్యానా, పంజాబ్ తదితర రాష్ట్రాల నుంచి కాంట్రాక్టర్లు వచ్చారని తెలిపారు. ఏప్రిల్ 18న జలసౌధలో జరిగిన సమావేశంలో బగాడియా, గురునానక్ వంటి కంపెనీల ప్రతినిధులు వచ్చి తాము కూడా టెండర్లలో పాల్గొంటామని కోరితే.. 'నేను కమిషనర్ అనుకుంటున్నావా? డైరెక్టర్ జనరల్‌ను' అంటూ ఓ అధికారి బెదిరించాడని ఆరోపించారు. ఏప్రిల్ 18న రైస్ మిల్లర్లతో సమావేశంలో జరిగిన చర్చను బయటపెట్టమంటారా? అని మంత్రి ఉత్తమ్‌కు సవాల్ విసిరారు. మొత్తంగా వాళ్లకు కావాల్సిన వ్యక్తులకే టెండర్లు ఇచ్చారని పేర్కొన్నారు. 'యూ' ట్యాక్స్ వసూలుకు కొందరిని నియమించుకున్నారని తెలిపారు. మిల్లర్లు బియ్యం ఇస్తామంటే వద్దని, డబ్బులే ఇవ్వాలని అడుగుతున్నారని పేర్కొన్నారు. రైస్ మిల్లర్లు నేరుగా టెండర్లలో పాల్గొనకుండా నిబంధనలు పెట్టి అడ్డుపడ్డారని ఆరోపించారు. మొత్తం 35 లక్షల టన్నులకు (3.5 కోట్ల క్వింటాళ్లకు) టెండర్లు జరిగాయని గుర్తుచేశారు. అధికంగా ఖరారు చేసిన రూ.216 లెక్కన మొత్తం రూ.800 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. మే 23 లోపు ధాన్యాన్ని తీసుకెళ్లాల్సి ఉంటుందని టెండర్ నిబంధనల్లో స్పష్టంగా పేర్కొన్నారని, గురువారం నాటికి 2 శాతం కూడా లిఫ్ట్ చేయలేదని చెప్పారు. కాంట్రాక్టర్లపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని, పైగా అదనపు సమయం ఇస్తామని ఎందుకు చెప్తున్నారని ప్రశ్నించారు.

అప్పుడు ఎందుకు అమ్మారు? ఇప్పుడెందుకు కొంటున్నారు?

రాష్ట్రంలో నిల్వ ఉన్న 1.59 లక్షల టన్నుల సన్నరకం వడ్లను క్వింటాలుకు రూ.2,259 చొప్పున ప్రభుత్వం అమ్మిందని గుర్తు చేశారు. ఇప్పుడు మధ్యాహ్న భోజనం, హాస్టల్‌లలో విద్యార్థుల కోసం అంటూ మళ్లీ రూ.5700కు తిరిగి సన్నబియ్యం ఎందుకు కొంటున్నారని ప్రశ్నించారు. 10 శాతం నూక ఉన్న బియ్యం బహిరంగ మార్కెట్‌లో గరిష్ఠంగా రూ.40 కే దొరుకుతున్నదని, దీనిని బట్టి క్వింటాలుకు రూ.17 అధికంగా చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. అప్పుడు అంత తక్కువ ధరకు వడ్లు ఎందుకు అమ్మారని, ఇప్పుడు అధిక ధరతో ఎందుకు కొంటున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తన ఆరోపణలపై సమాధానం చెప్పలేక మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ముఖం చాటేశారని, పోలీసులకు ఫిర్యాదు చేయించి తనపై కేసు పెట్టించారని మండిపడ్డారు. పూర్తి వాస్తవాలతో చర్చకైనా, సిట్టింగ్ జడ్జితో విచారణకైనా తాను సిద్ధంగా ఉన్నాని తేల్చి చెప్పారు. ఉత్తమ్‌కు దమ్ము, ధైర్యం ఉంటే ముందుకు రావాలని సవాల్ విసిరారు. జగ్గారెడ్డికి పౌరసరఫరాల శాఖపై ఏం అవగాహన ఉన్నదని మాట్లాడారో అర్థం కావడం విమర్శించారు.

మంత్రి ఉత్తమ్‌కు ఏలేటి క్షమాపణ చెప్పాలి

టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్

హైదరాబాద్, మే 23 (నమస్తే తెలంగాణ): యూ ట్యాక్స్ అంటూ నిరాధార ఆరోపణలు చేసిన బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వెంటనే మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి క్షమాపణ చెప్పాలని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పౌరసరఫరాల కమిషనర్ చౌహాన్‌పై మహేశ్వర్‌రెడ్డి చేసిన నిరాధార ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. మహేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ద్వారా పదవులు పొంది, పార్టీ మారగానే ఆయనను విమర్శించడం పచ్చి అవకాశవాద రాజకీయమని విమర్శించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిది స్వదేశీ నినాదం, విదేశీ వ్యాపారమని ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసిన కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీని విమర్శించే అర్హత కిషన్‌రెడ్డికి లేదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులను బెదిరిస్తున్నారని కిషన్‌రెడ్డి మాట్లాడటం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని పేర్కొన్నారు.

మహేశ్వర్‌రెడ్డి ఆరోపణలు నిరాధారం

- ఉత్తమ్ వైట్ పేపర్ లాంటోడు
- కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి

హైదరాబాద్, మే 23 (నమస్తే తెలంగాణ): బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రచారం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి ధ్వజమెత్తారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. తమ ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకే సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులపై ఆరోపణలు చేస్తున్నారని, వారి ఆటలు సాగవని హెచ్చరించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వైట్ పేపర్‌లాంటోడని, ఇంక్ చల్లొద్దని మహేశ్వర్‌రెడ్డికి హితవు పలికారు. తప్పులేకున్నా బట్టకాల్చి మీద వేస్తున్నాడని, ఆయనకు ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై ఎందుకు కోపం వచ్చిందో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. అటు రైతులు, ఇటు రైస్ మిల్లర్లు నష్టపోవద్దని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తున్నదని తెలిపారు. ఐదేండ్లపాటు రేవంత్‌రెడ్డే ముఖ్యమంత్రిగా కొనసాగుతారని, ఈ విషయంలో ఎలాంటి అనుమానాలకు తావులేదని స్పష్టం చేశారు.

విత్తనాలో.. రామచంద్రా!

- ఫర్టిలైజర్ షాపుల వద్ద రైతుల క్యూ
- పత్తి, జనుము, జీలుగ విత్తనాల కోసం పడిగాపులు
- పాస్‌బుక్కులు, చెప్పులు లైన్లలో పెట్టాల్సిన దుస్థితి
- పదేండ్ల క్రితం పరిస్థితులు పునరావృతం
- కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంపై మండిపడుతున్న రైతులు

రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలో వ్యవసాయ కార్యాలయం వద్ద జనుము విత్తనాల కోసం ఉదయం నుంచి బారులు తీరిన రైతులు (ఫైల్)

హైదరాబాద్, మే 23 (నమస్తే తెలంగాణ): విత్తనాల కోసం రైతులు మళ్లీ యుద్ధం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. సాగు కోసం సన్నద్ధమవుతున్న రైతులలు గంటల పాటు షాపుల ఎదుట క్యూలో నిలబడాల్సిన దుర్భర స్థితి నెలకొన్నది. ఎండలో నిలబడే ఓపిక లేక పాస్‌పుస్తకాలు, చెప్పులను క్యూలో పెడుతున్నారు. తొమ్మిండ్లుగా విత్తన కష్టాలకు దూరంగా ఉన్న రైతులకు... నేడు మళ్లీ ఆ పరిస్థితి వచ్చిందని ఆందోళన చెందుతున్నారు. విత్తనాల సరఫరాలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జీలుగ విత్తనాలు కూడా ఇవ్వలేరా?

జనుము, జీలుగ, పిల్లిపెసరను సీజన్ ప్రారంభంలో పొలంలో పెంచి ఆ తర్వాత కలియ దున్నడంతో నత్రజని ఉత్పత్తి అవుతుంది. దీంతో రసాయన ఎరువుల వినియోగం తగ్గడంతో పాటు ఎరువుల ఖర్చు కూడా తగ్గుతుంది. దీన్ని ప్రోత్సహించేందుకు గానూ బీఆర్ఎస్ ప్రభుత్వం సీజన్‌కు ముందే పచ్చిరొట్ట విత్తనాలను సబ్సిడీపై రైతులకు అందుబాటులో ఉంచేది. కానీ కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం విత్తనాల పంపిణీలో విఫలమైంది. మొత్తం 50వేల క్వింటాళ్ల విత్తనాలను సిద్ధంగా ఉంచినట్టు తెలిసింది. వీటిని క్షేత్రస్థాయిలో సరఫరా చేయడంలో విఫలమైంది. దీంతో సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లో రైతులు నానా తంటాలు పడుతున్నారు. అధికారులు టోకెన్లు జారీ చేసి ఇస్తుండడంతో రైతులు ఉదయాన్నే షాపుల ఎదుట క్యూ కడుతున్నారు.

పత్తి విత్తనాలకూ కొరతే

ఈ ఏడాది 60 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందుకు 1.20 కోట్ల విత్తన ప్యాకెట్లు అవసరం అవుతాయి. మంత్రి తుమ్మల విత్తనాల లభ్యతపై సమీక్ష కూడా నిర్వహించారు. అయినప్పటికీ కొరత మాత్రం తప్పలేదు. ముఖ్యంగా పత్తి సాగు అధికంగా ఉండే ఆదిలాబాద్ జిల్లాలోనే ఈ పరిస్థితి నెలకొన్నది.

ప్రణాళికతో సరి... కార్యాచరణేది?

ఈ సీజన్‌లో 1.34 కోట్ల ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ భావిస్తున్నది. 16.50 లక్షల క్వింటాళ్ల వరి విత్తనాలు, 1.20 కోట్ల పత్తి విత్తనాల ప్యాకెట్లు.. ఇలా మొత్తం 19.39 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరం అవుతాయని ప్రణాళిక సిద్ధం చేసింది. కానీ ఈ సీజన్‌లో ముందుగానే వర్షాలు మొదలయ్యాయి. ఈ విషయాన్ని ముందుగా అంచనా వేయడంలో విఫలమైన వ్యవసాయ శాఖ విత్తనాలను క్షేత్రస్థాయిలో మాత్రం సిద్ధం చేయించలేకపోయింది. దీంతో విత్తనాల కొరత ఏర్పడింది. ప్రణాళిక సిద్ధం చేసిన వ్యవసాయ శాఖ కార్యాచరణలో మాత్రం పూర్తిగా నిర్లక్ష్యం వహించిందనే విమర్శలున్నాయి.

విత్తన కొనుగోళ్లలో జాగ్రత్తలు తీసుకోండి

వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు

హైదరాబాద్, మే 23 (నమస్తే తెలంగాణ): విత్తన కొనుగోళ్లలో జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు సూచించారు. గురువారం సంబంధిత అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన రసీదును పంటకాలం పూర్తయ్యే వరకు దాచుకోవాలని తెలిపారు. వ్యవసాయ అధికారులు టాస్క్ ఫోర్స్ బృందాలు పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నకిలీ విత్తనాల పట్టివేత

శామీర్‌పేట, మే 23: అక్రమంగా తరలిస్తున్న నకిలీ విత్తనాలను ఎస్‌వోటీ పోలీసులు గురువారం పట్టుకున్నారు. కర్ణాటక నుంచి మంచిర్యాలకు బొలేరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న ఎస్‌వోటీ పోలీసులు జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలోని తుర్కపల్లి వద్ద రాజీవ్ రహదారిపై రూ.30 లక్షల విలువ చేసే విత్తనాలను పట్టుకున్నారు.

ఐదు నెలల్లో పరిస్థితి తలకిందులు

బీఆర్ఎస్ సర్కారు హయాంలో రైతులు విత్తనాలు, ఎరువుల కొరతను మర్చిపోయారు. పక్కా ప్రణాళికతో వ్యవహరించి సీజన్ ప్రారంభానికి ముందే క